EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

గురువారం

30-10-2025

పేజీలు: 02







## అధికారులకు డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు

మొంథా తుపాను అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన చర్యలను తక్షణమే మొదలుపెట్టాలని సూచించారు. 1583 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు అధికారులు డిప్యూటీ సీఎంకు తెలియచేశారు. శానిటేషన్ సిబ్బందిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకున్నామని చెప్పారు. 38 చోట్ల రోడ్లు తీవ్రంగా దెబ్బ తిన్నాయనీ, మరో 125 చోట్ల రహదారులకు గుంతలు ఏర్పడ్డాయని వివరించారు. రక్షిత తాగు నీటి పథకాల ట్యాంకులు దగ్గర క్లోరినేషన్ ప్రక్రియ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "తాగు నీటిని అందించే పథకాలకు, నీటి సరఫరాకు ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయం మార్గాలు అన్వేషించాలని. ఈ చర్యలు తక్షణమే తీసుకోవాలని ఆయన అన్నారు. గ్రామాల్లో మొబైల్ శానిటేషన్ బృందాలను సిద్ధంగా ఉంచాలని.. 21,055 మంది పారిశుద్ధ్య సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి పారిశుద్ధ్య మెరుగుదలకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. వాన నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో నీటిని బయటకు పంపించే చర్యలు తీసుకోవాలని. నీరు ఎక్కడ కలుషితం కాకుండా, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.










# వరంగల్ నగరాన్ని ముంచెత్తిన మొంథా తుపాను

## వరద నీటిలో చిక్కుకున్న కాలనీలు, స్తంభించిన రాకపోకలు

మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని వరంగల్ నగరంలో బుధవారం భారీ వర్షం కురిసింది, దీంతో నగరం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి, ప్రధాన రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. వరంగల్ ప్రజలు ఊహించని ఈ ప్రకృతి విపత్తుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం కొన్ని గంటల పాటు కురిసిన వర్షానికే నగరం ఉక్కిరిబిక్కిరి అయింది. ఈ వర్షానికి ప్రధానంగా బొంది వాగు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగింది. బొంది వాగు ఉధృతి కారణంగా హంటర్ రోడ్డు పూర్తిగా జలమయం కావడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇది నగరంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించింది. అదే విధంగా, ములుగు రోడ్డు వద్ద నాలా ఉధృతంగా ప్రవహించడంతో వరంగల్-హనుమకొండ మధ్య రాకపోకలకు ఆటంకం ఏర్పడింది, దీంతో ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారులపై నీరు నిలవడంతో వందలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భారీ వర్షాల ధాటికి నగరంలోని పలు కాలనీలలోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. సంతోషిమాత కాలనీ, డీకే నగర్, ఎన్ఎన్ నగర్, మైసయ్య నగర్, సమ్మయ్య నగర్, సాయి గణేష్ కాలనీల ప్రజలు ఈ వరద కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నివాసాలలోకి నీరు చేరడంతో వారి నిత్యావసర వస్తువులు, సామాన్లు పాడయ్యాయి. తమ ఇళ్లనుండి నీటిని బయటకు పంపడానికి స్థానికులు నానా తంటాలు పడుతున్నారు, పలువురు తమ ఇళ్లను విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరంగల్‌లో ఏర్పడిన ఈ జలదిగ్బంధంపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల ప్రజలకు



తగిన సహాయం అందించేందుకు స్థానిక అధికారులు కృషి చేస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, నగర పౌరులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. తాజా వర్షపాతం, వరద నష్టం అంచనా వేయడానికి బృందాలు రంగంలోకి దిగాయి.

## తులం రూ.1970 తగ్గిన 24 క్యారెట్ గోల్డ్.. కేజీకి వెయ్యి తగ్గిన వెండి

బంగారం, వెండి ధరలు నిన్నటి పెరుగుదలకు బ్రేక్ వేస్తూ ఇవాళ భారీగా తగ్గుముఖం పట్టాయి. ఈ అనూహ్య పతనం కొనుగోలుదారులు, పెట్టుబడిదారులకు కాస్త ఉపశమనాన్ని ఇచ్చింది. ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో పసిడి రేట్లు తగ్గడం సామాన్య ప్రజలకు తీపి కబురుగా మారింది. నిన్నటితో పోలిస్తే ఇవాళ దేశీయ బులియన్ మార్కెట్‌లో ధరలు గణనీయంగా దిగొచ్చాయి. ప్రస్తుత మార్కెట్ వివరాల ప్రకారం, హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.1,910 తగ్గి రూ.1,20,490 వద్ద స్థిరపడింది. అదే విధంగా, ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా రూ.1,750 భారీగా పతనమై రూ.1,10,450కి చేరింది. నిన్నటి పెరుగుదల తర్వాత ఇవాళ పసిడి రేట్లు ఇంత పెద్ద మొత్తంలో తగ్గడం మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. బంగారంతో పాటు వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. కేజీ వెండి ధరపై రూ.1,000 తగ్గి రూ.1,65,000గా నమోదైంది. గత కొద్ది రోజులుగా పెరుగుతున్న వెండి ధరలకు ఈ తగ్గుదల తాత్కాలికంగా ఉపశమనం కలిగించింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఇతర



ప్రధాన నగరాల్లో కూడా దాదాపుగా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాలతో పాటు దేశీయంగా మార్కెట్‌లో ఉన్న డిమాండ్, పండుగలు, శుభకార్యాల సీజన్ వంటి అంశాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతుంటాయి. ప్రస్తుత తగ్గుదలను వినియోగించుకుని కొనుగోళ్లు జరపడానికి కొనుగోలుదారులు ఆసక్తి చూపే అవకాశం ఉంది. అయితే, ధరల్లోని ఈ అస్థిరత కారణంగా పెట్టుబడిదారులు మార్కెట్‌ను నిశితంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



## అతను.. టార్గెట్ చేశాడు! చర్యలు తీసుకోండి

సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ హీరో చిరంజీవి బుధవారం మరోసారి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. తనపై అభ్యంతకర పోస్టులు పెడుతూ, దుర్భాషలాడుతున్న కొన్ని ఎక్స్ హ్యాండిల్ ప్రొఫైల్‌పై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా దయాచౌదరి అనే వ్యక్తి తనను లక్ష్యంగా చేసుకొని దూషణకు పాల్పడుతున్నాడనీ, అతనిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని చిరంజీవి పోలీసులను కోరారు. కొందరు తన ఫొటోలను మార్ఫింగ్ చేసి డిజిటల్ ఫ్లాట్ఫామ్‌లపై వైరల్ చేస్తున్నారని ఇటీవలే చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిరంజీవి పేరు, ఫొటోలు, గొంతును ఆయన అనుమతి లేకుండా ఎవరూ ఉపయోగించకూడదని సిటీ సివిల్ కోర్టు ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది.



## రకుల్ ప్రీత్ సింగ్ గ్లామర్ ఫుల్

రకుల్ ప్రీత్ సింగ్ అందం గురించి కొత్తగా చెప్పేదేముంది? మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ గ్లామరస్ హీరోయిన్లలో ఆవిడ ఒకరు. సోషల్ మీడియాలో లేటెస్టుగా కొన్ని ఫోటోలు షేర్ చేశారు. అయితే ఈ ఫోటోల వెనక కహానీ ఏమిటో తెలుసా? ఇటీవల దీపావళి జరిగింది కదా! నార్త్ ఇండియాలో దీపావళిని చాలా ఘనంగా సెలబ్రేట్ చేసుకుంటారు కొందరు. రకుల్ ఫ్యామిలీ కూడా అంతే! దీపావళి సంబరాలలో భాగంగా ఈ ఫోటోలను రకుల్ షేర్ చేశారు. రకుల్ ఇప్పుడు తెలుగు సినిమాల కంటే హిందీ సినిమాలు ఎక్కువ చేస్తున్నారు. అజయ్ దేవగన్, ఆవిడ జంటగా నటించిన 'దే దే ప్యార్ దే' సీక్వెల్ 'దే దే ప్యార్ 2' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## ఉప్పాడ తీరానికి కొట్టుకువస్తున్న బంగారు రేణువులు.. ఎగబడ్డ జనం

కాకినాడ జిల్లా ఉప్పాడ సముద్ర తీరంలో చేపల కోసం వేట కొనసాగించే మత్స్యకారులు.. తుఫాన్ నేపథ్యంలో బంగారం కోసం అన్వేషిస్తుండడం ఆసక్తిగా మారింది. తుఫాన్ ప్రభావంతోనూ చిన్నాపెద్దా తేడా లేకుండా ఉప్పాడ సముద్ర తీరంలో బంగారం రేణువులు అన్వేషిస్తున్నారు. ఇసుకలోని మిణుకు మిణుకుమని మెరిసే బంగారు రంగు రేణువులను సేకరిస్తున్నారు. కొందరికి బంగారం రేణువులు దొరకడంతో సంబరపడిపోతున్నారు. తుఫాన్ వచ్చిందంటే కాకినాడ జిల్లా ఉప్పాడ మత్స్యకారుల్లో కొత్త ఆశలు చిగురిస్తుంటాయి. తుఫాన్‌లు, భారీ వర్షాలు, ఆటుపోటు సమయంలో సముద్ర తీరంలో పెద్దఎత్తున అలలు వస్తుంటాయి. దీంతో.. ఇసుకతో పాటు.. అనేక రకాల ద్రవ, ఘన పదార్థాలు ఒడ్డుకు కొట్టుకొస్తాయి. అలా వచ్చిన ఇసుకలో అప్పుడప్పుడు బంగారు రేణువులూ దొరుకుతాయనే ప్రచారంతో ఉప్పాడ పరిసర ప్రాంతాల ప్రజలు.. వాటి కోసం వేట కొనసాగిస్తుంటారు.

## త్వరలో ఇండియా అధికారిక కాలర్ ఐడీ

గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండేందుకు చాలా మంది తమ మొబైల్ ఫోనుల్లో ట్రూకాలర్ వంటి థర్డ్ పార్టీ అప్లికేషన్లు వాడుతుంటారు. ఈ థర్డ్ పార్టీ యాప్‌ల అవసరం లేకుండా మొబైల్ ఫోన్ వినియోగదారులు ఆయా సేవలు పొందేందుకు వీలుగా.. కాలింగ్ నేమ్ ప్రజంటేషన్(సీఎన్ఏపీ) పేరిట భారతదేశ అధికారిక కాలర్ ఐడీ అందుబాటులోకి రాబోతుంది. మొబైల్‌కు ఇన్‌కమింగ్ కాల్ వచ్చినప్పుడు.. సదరు నంబరు ఎవరి పేరు మీద రిజిస్టర్ అయి ఉందో ఆ పేరు మొబైల్ స్క్రీన్‌పై కనిపించనుంది. సీఎన్ఏపీ సేవలు తమకు వద్దు అనుకునే వారు తమ టెలికామ్ సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి వాటిని నిలిపివేసుకోవచ్చు. ఈ సీఎన్ఏపీ అమలు కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్స్ (డీఓటీ) చేసిన ప్రతిపాదనకు ట్రాయ్ ఇప్పటికే ఆమోదం తెలిపింది.

# కురుక్షేత్ర సీజన్ 2 రివ్యూ



ఇటీవల దిగ్గజ స్ట్రీమింగ్ యాప్ నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ అయ్యిన యానిమేటెడ్ సిరీస్ నే కురుక్షేత్ర. హిందీలో తెరకెక్కించిన ఈ సిరీస్ తెలుగు డబ్బింగ్ లో కూడా అందుబాటులో ఉంది. అయితే మొదటి సీజన్ గా 9 ఎపిసోడ్స్ వస్తే నెక్స్ట్ 9 ఎపిసోడ్స్ ఇప్పుడు స్ట్రీమింగ్ కి వచ్చాయి. ఇక ఈ ఎపిసోడ్స్ ఎలా ఉన్నాయి అనేది సమీక్షలో చూద్దాం రండి. గత 9 ఎపిసోడ్స్ తర్వాత కొనసాగింపుగా కౌరవ పక్షానికి ద్రోణాచార్యుని తర్వాత వారికి సైన్యాధ్యక్షుడు ఎవరు అనేది ప్రశ్నగా మారుతుంది. ఇంకోపక్క పాండవులు, కౌరవ పక్షాన ఉన్న యోధులు దుర్యోధనుడు, కర్ణుడు, అశ్వత్థామ ఇతరులతో చేసిన భీకర పోరాటం ఎలా సాగింది? అసలు ఈ కురుక్షేత్రంకి ఆది ఏంటి అంతం ఎవరు? ఈ క్రమంలో భీముడుకి కనిపించిన ప్రాముఖ్యత ఏంటి? శ్రీకృష్ణుడు బోధించిన ధర్మ మార్గం, కర్మ ఫలితాలు, 18 రోజుల కురుక్షేత్ర మహా సంగ్రామం తర్వాత ఏం జరిగింది అనేది తెలియాలి అంటే ఈ మిగతా ఎపిసోడ్స్ చూడాలి. మొదటి సీజన్ లో వచ్చిన 9 ఎపిసోడ్స్ కి కొనసాగింపుగా వచ్చిన ఈ తదుపరి సీజన్ డీసెంట్ గా ఉందని చెప్పవచ్చు. ఇందులో కుంతి, కర్ణ అలాగే దుశ్శాసన, భీమ ఇంకా అశ్వత్థామ ఎపిసోడ్స్ బాగున్నాయని చెప్పాలి. మంచి యుద్ధ సన్నివేశాలు, ఎమోషన్స్ వీటిలో కనిపిస్తాయి. అంతేకాకుండా గత సీజన్ లో యుద్ధనికి ముందు చూపించిన పరిస్థితిలు యుద్ధం సమయంలో పరిస్థితులు ఆకట్టుకుంటే ఇందులో వాటితో పాటుగా యుద్ధం తర్వాత చూపించిన పరిస్థితులు వాటిపై సాగే స్త్రీ పర్వ ఎపిసోడ్ ఒకింత డ్రామా మంచి డైలాగ్స్ లాంటి వాటిని కోరుకునే వారికి కనెక్ట్ అవుతుంది. ఇక శ్రీకృష్ణ పాత్రపై పలు సన్నివేశాలు, గ్రాండ్ విజువల్స్ లాంటివి తన అభిమానులకు మరోసారి ట్రీట్ అందిస్తాయి అని చెప్పొచ్చు. ఈ మిగతా 9 ఎపిసోడ్స్ తాలూకా సీజన్ లో కొన్ని ఎపిసోడ్స్ బాగున్నప్పటికీ కథనం మాత్రం స్లోగా వెళుతున్నట్టు అనిపించక మానదు. అయితే అది ఆవశ్యకం అయినప్పటికీ గత సీజన్ ని చూసిన జెనరల్ ఆడియెన్స్ కి రుచించకపోవచ్చు. ఇక దీనితో పాటుగా అర్జునుడు వర్సెస్ కర్ణ ఎపిసోడ్స్ కి మంచి క్రేజ్ ఉంటుంది. ఇది ఈ మధ్య సినిమాలతో కూడా బాగా వైరల్ అయ్యింది. ఈ ఎపిసోడ్ ని ఇంకా బెటర్ గా ప్లాన్ చేస్తే బాగుండు అనిపిస్తుంది. అంతే కాకుండా మహాభారతం కోసం మంచి ఐడియా ఉన్నవారికి అలాగే ఇది వరకు ఇతర వెర్షన్స్ విన్నవారికి ఇది కొంచెం భిన్నంగా అనిపించే అవకాశం కూడా ఉంది. సో వారు ఈ సీజన్ ని పూర్తి స్థాయిలో ఎంజాయ్ చేయలేకపోవచ్చు. ఓవరాల్ సిరీస్ లో నిర్మాణ విలువలు అయితే బాగానే ఉన్నాయి. మంచి సంగీతం, యాక్షన్ పార్ట్ అలానే పాత్రలు డిజైన్ వంటివి బాగున్నాయి. అయితే యానిమేషన్ పరంగా చాలా వరకు మంచి వర్క్ అందించే ప్రయత్నం అయితే చేసినట్టు కనిపిస్తుంది. ఇక దర్శకుడు ఉజాన్ గంగూలీ మొదటి 9 ఎపిసోడ్స్ లోనే దాదాపు 14 రోజుల యుద్ధాన్ని చూపించేశారు.కానీ మిగతా 4 రోజుల యుద్ధాన్ని ఎలా మిగతా 9 ఎపిసోడ్స్ కి తీర్చిదిద్దారు అనే దానికి డీసెంట్ ఆన్సర్ ఇచ్చే యత్నం చేసారని చెప్పొచ్చు. తన విజన్, వర్క్ బాగుంది కానీ ఇంకా ఏదో మిస్ అవుతున్నట్టు అనిపిస్తుంది. ఓవరాల్ గా అయితే తన వర్క్ మరీ అంత డిజప్పాయింట్ చెయ్యదు. ఇక మొత్తంగా చూసుకున్నట్టు అయితే ఈ మిగతా 9 ఎపిసోడ్స్ తో మొత్తం 18 రోజుల 'కురుక్షేత్ర' యుద్ధాన్ని ముగించిన విధానం డీసెంట్ గానే అనిపిస్తుంది. ఈ సీజన్ లో యాక్షన్, ఎమోషన్ పార్ట్ కంటే డ్రామా ఎక్కువ సమయం తీసుకుంటుంది. సో ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ట్రై చేస్తే మంచిది. కేవలం యాక్షన్, విజువల్స్ మాత్రమే కోరుకునే వారు కాకుండా కురుక్షేత్రం కోసం ఆ మహాసంగ్రామంలోని చూడని తెలియని పరిస్థితులు ఇలానే ఉంటాయా? అనుకునే ఉత్సకత ఉన్నవారికి అయితే బాగానే అనిపిస్తుంది.

### ఉపఎన్నిక వేళ బీఆర్ఎస్‌కు భారీ ఎదురుదెబ్బ.. 200 మంది అనుచరులతో

# కాంగ్రెస్ గూటికి జూబ్లీహిల్స్ కీలక నేత



తెలంగాణలో ఉపఎన్నికల నగారా మోగుతున్న వేళ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి బలం చేకూరుస్తూ అధికార బీఆర్ఎస్ (BRS) పార్టీకి గట్టి షాక్ తగిలింది. ముఖ్యంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు చెందిన కీలకమైన మైనారిటీ నేత, ఆయన అనుచరులు కాంగ్రెస్ కండువా కప్పుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ పార్టీ బోరబండ డివిజన్ మైనారిటీ అధ్యక్షుడిగా ఉన్న సయ్యద్ సిరాజ్జుద్దీన్, పార్టీ నాయకత్వంపై అసంతృప్తితో దాదాపు 200 మంది అనుచరులతో సహా కాంగ్రెస్‌లో చేరారు. ఈ చేరికతో స్థానికంగా బీఆర్ఎస్‌కు మైనారిటీ వర్గాల మద్దతు కొంత మేర తగ్గే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సయ్యద్ సిరాజ్జుద్దీన్‌ను కాంగ్రెస్ పార్టీలోకి మంత్రి సీతక్క ప్రత్యేకంగా ఆహ్వానించారు. మంత్రి సీతక్క సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దిన్ సతీమణి హబీబా సుల్తానా వంటి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన సిరాజ్జుద్దీన్ మరియు ఆయన అనుచరులకు కాంగ్రెస్ నాయకులు సాదరంగా ఆహ్వానం పలికి, పార్టీ కండువాలు కప్పి అక్కున చేర్చుకున్నారు. ఈ చేరికలు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి దోహదపడతాయని, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని ముఖ్య నియోజకవర్గాల్లో పార్టీకి మరింత మైలేజీ ఇస్తాయని కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపఎన్నికల ముంగిట ఇలాంటి కీలక నేతల వలసలు సహజంగానే అధికార పార్టీకి ప్రతికూల సంకేతాలుగా పరిగణించబడతాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మైనారిటీ ఓటు బ్యాంకు కీలకం కావడంతో, ఈ వర్గానికి చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి మారడం ఆ పార్టీకి నష్టదాయకమే. ముఖ్యంగా, బీఆర్ఎస్ పాలనలో మైనారిటీల సంక్షేమంపై తగిన దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్న తరుణంలో, ఈ వలస మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నాయకులు ఇలా బయటికి వెళ్లడం క్యాడర్‌లో కొంత నిరుత్సాహాన్ని కలిగించే అవకాశం ఉంది. మరోవైపు, బీఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉన్న మరికొంత మంది నాయకులను కూడా కాంగ్రెస్ పార్టీ తమ గూటికి చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని కాంగ్రెస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి సయ్యద్ సిరాజ్జుద్దీన్ వంటి కీలకమైన స్థానిక నాయకుడు చేరడం, ఉపఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీకి ఒక అస్త్రంగా ఉపయోగపడే అవకాశం ఉంది. ఈ పరిణామం బీఆర్ఎస్ నాయకత్వంపై మరింత ఒత్తిడిని పెంచి, తమ శ్రేణులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తుంది. మొత్తానికి, తాజా పరిణామం తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపిందనే చెప్పవచ్చు.



## అల్లు అర్జున్- అట్లీ సినిమాలో అనన్య

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తదుపరి సినిమాపై చాలా అంచనాలు ఉన్నాయి. 'పుష్ప 2' హిట్ కావడంతో, దానిని మించేలా సినిమాను తెరకెక్కించడం ఇప్పుడు దర్శకుల ముందున్న అతి పెద్ద సవాలు. పుష్ప 2 వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత అల్లు అర్జున్ దర్శకుడు అట్లీతో చేతులు కలిపాడు. ఈ సినిమా కోసం ఇప్పటికే విస్తృత సన్నాహాలు జరుగుతున్నాయి. అలాగేనటీనటుల ఎంపిక ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు అనే దానిపై పెద్ద చర్చే జరుగుతోంది. మృణాల్ ఠాకూర్ పేరు ఇంతకు ముందు ప్రముఖంగా వినిపించింది. అలాగే ప్రియాంక చోప్రా, జాన్వీ కపూర్, దిశా పటానీల పేర్లు కూడా బాగా వినిపించాయి. అయితే ఇప్పుడు మరో బాలీవుడ్ నటి అనన్య పాండే పేరు కూడా ఈ జాబితాలోకి వచ్చింది. నటి అనన్య పాండే తెలుగు సినిమాకు కొత్తేమీ కాదు. ఆమె గతంలో విజయ్ దేవరకొండతో 'లైగర్' సినిమా లో హీరోయిన్ గా నటించింది.



## ఢిల్లీలో క్లౌడ్ సీడింగ్ ఫ్లాప్

ఢిల్లీలో కాలుష్య రక్కసిని తరిమికొట్టేందుకు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలించట్లేదు. కృత్రిమ వర్షం కురిపించి కొంతలో కొంతైనా పొల్యూషన్‌ను తగ్గిద్దామని క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మేఘాలను చల్లబరిచి వర్షింపజేసేందుకు విమానాలను రంగంలోకి దింపి రసాయనాలను చల్లించింది. ఐఐటీ–కాన్పూర్ సహకారంతో రాజధానిలో మేఘమథన క్రతువుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. లక్షా, పది లక్షాలు కాదు_ _ _ ఏకంగా 3 కోట్ల 21 లక్షల రూపాయలను ఈ క్లౌడ్ సీడింగ్‌కు ఖర్చు చేసింది. ఈ క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ మంగళవారం జరిగింది. ఆ వెంటనే అదిగో వర్షం_ _ _ ఇదిగో వర్షం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. పలువురు ప్రభుత్వ అధికారులు తడిసి ముద్దవ్వడం పక్కా అన్న సంకేతాలు కూడా ఇచ్చారు. టూ అవర్స్ టూ గో_ _ _ వన్ అవర్ టూ గో అంటూ కౌంట్‌డౌన్ ప్రక్రియ కూడా సాగింది. కానీ_ _ _ చుక్క అంటే చుక్క వర్షం కూడా ఢిల్లీపై పడకపోవడం ఆశ్చర్యపరిచింది. కోట్లు ఖర్చు చేసినా మేఘాల్లోంచి చుక్క రాలకపోవడం ఆందోళనకు కారణమైంది. క్లౌడ్ సీడింగ్ ఫెయిల్ అవ్వడంపై IIT కాన్పూర్ డైరెక్టర్ మనీంద్ర అగర్వాల్ స్పందించారు. మేఘాల్లో తేమ లేకపోవడం వల్ల ప్రయత్నాలు విఫలం అయ్యాయని తెలిపారు. క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ కాలుష్యాన్ని తగ్గించేందుకు శాశ్వత పరిష్కారం కాకపోయినా.. కొంత ఉపశమనం కలిగిస్తుందన్నారు. ఇప్పుడీ ప్రక్రియ సక్సెస్ కాకపోయినా ఆ తర్వాత దీని ఫలితం ఉంటుందని చెప్పుకొచ్చారు. క్లౌడ్ సీడింగ్‌తో పని జరగదని మేం ముందే చెప్పామంటున్నారు ఎక్స్‌పర్ట్స్. ఇలాంటి ప్రక్రియలతో ప్రయోజనం 15 శాతం మాత్రమే ఉంటుందంటున్నారు. కాలుష్య నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలంటున్నారు. ఇటు కాలుష్యంతో 42 శాతం మంది గొంతు నొప్పి, 17 శాతం మంది దగ్గు, దాదాపు 25 శాతం మంది కళ్ళ మంటతో బాధపడుతున్నారని పలు సర్వేలు చెబుతున్నారు. దీపావళి తర్వాత వాయు కాలుష్యం మరింత పెరిగిందని_ _ _ గత ఐదేళ్ళల్లో ఇదే అత్యంత ఎక్కువ అంటున్నాయి. అలాగే ఈ ఎయిర్ పొల్యూషన్ నుంచి తప్పించుకునేందుకు 44 శాతం మంది ఇళ్ళ నుంచి బయటకు రావడమే మానేశారని పలు సర్వేలు తేల్చాయి.



### ఆధార్ సెంటర్లలో అడ్డగోలుగా దోచుకుంటున్నారా..

## ఇలా ఫిర్యాదు చేయండి

మన వ్యక్తిత్వానికి గుర్తు ఆధార్. నేడు దేశంలో ఎవరికైనా ప్రభుత్వ పథకాలు కావాలన్నా, బ్యాంకు పనులు చేయాలన్నా, సబ్సిడీలు పొందాలన్నా_ _ _ ఆధార్ తప్పనిసరిగా అవసరమయ్యే పరిస్థితి. అందుకే ఆధార్ కేంద్రాల వద్ద ఎప్పుడూ జనసందోహమే కనిపిస్తుంది. కొత్తగా నమోదు చేసుకునేవాళ్లు, పేరు, అడ్రస్ మార్చించుకునేవాళ్లు, బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకునేవాళ్లు ఎప్పుడూ లైన్లలోనే ఉంటున్నారు.అయితే ఈ రద్దీని, అవసరాన్ని లాభంగా మార్చుకుంటూ కొంతమంది సెంటర్ల వద్ద అన్యాయంగా వసూళ్లకు తెగబడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నియమాల ప్రకారం తీసుకోవాల్సిన ఫీజులకంటే ఎక్కువ వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. అధికారుల తనిఖీలు మాత్రం పేరు కోసం మాత్రమే జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆధార్ నమోదు, అప్‌డేట్‌లకు సంబంధించిన రుసుములలో మార్పులు చేసింది. అక్టోబర్ 1 నుంచి కొత్త ఛార్జీలు అమల్లోకి వచ్చాయి. ఇకపై ప్రతి కేంద్రం వద్ద ఫీజుల వివరాలు గోడపై స్పష్టంగా ప్రదర్శించాలి అని యూఐడీఏఐ (UIDAI) ఆదేశించింది.

## వైద్యవిద్యలో పీజీ చేసినా.. 50% మంది సర్జరీ చేయలేరు

ఒకప్పుడు ఎంబీబీఎస్ చేసిన డాక్టర్లు సైతం పలు రకాల సర్జరీలు చేయగలిగేవారు. ఇప్పుడు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసినా కత్తి పట్టుకునేందుకు యువ వైద్యుల చేతులు వణుకుతున్నాయని... గైనకాలజీ చేసినా సిజేరియన్ చేయలేని దుస్థితిలో చాలా మంది ఉంటున్నారని.. తాజా సర్వేలో వెల్లడైంది. పీజీ పూర్తి చేసిన వైద్యుల్లో 50.5 శాతం మంది.. సొంతంగా సర్జరీ చేసే విషయంలో తమపై తమకే నమ్మకం కలగట్లేదని ఈ సర్వేలో చెప్పడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇండియాలో వైద్య విద్య ప్రమాణాలు, మెడికల్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలు, మెడికోల మానసిక ఆరోగ్యంపై 'ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్' (ఫైమా) నిర్వహించిన రివ్యూ మెడికల్ సిస్టమ్(ఆర్ఎమ్ఎస్) సర్వే -2025లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, యూనియన్ టెరిటరీలకు చెందిన 2,000 మందికి పైగా మెడికల్ విద్యార్థులు, పీజీ రెసిడెంట్లు, ఫ్యాకల్టీని ఈ సర్వేలో భాగంగా ప్రశ్నించారు. సర్వే నివేదికను ఫైమా బుధవారం జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎమ్సీ) చైర్మన్‌కు అందజేసింది.